సబ్సిడీపై ఆయిల్‌పాం మొక్కలివ్వాలి

ఆయిల్‌ఫెడ్ అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అశ్వారావుపేట/దమ్మపేట రూరల్, జనవరి 23: వ్యవసాయ భూమి ఉన్న రైతులందరికీ సబ్సిడీపై ఆయిల్‌పాం మొక్కలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఆయిల్‌పాం ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్ మంగళవారం పాకలగూడెం వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల స్పందిస్తూ.. టీఎస్ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట డివిజినల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్‌లను పిలిచి ఆయిల్‌పాం సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులకు భూమికి చెందిన ఏదైనా భూ రికార్డును పరిశీలించి సబ్సిడీపై పామాయిల్ మొక్కలు పంపిణీ చేయాలని, ఇతర సబ్సిడీ పథకాలు అమలు చేయాలని సూచించారు. పామాయిల్ రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందుగానే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాహుల్‌పై దాడిని నిరసిస్తూ ఎమ్మెల్యేల రాస్తారోకో

ఇల్లెందులో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే కోరం

మణుగూరులో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే పాయం

ఇల్లెందు, జనవరి 23: ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీపై అసోంలో జరిగిన దాడికి నిరసనగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బుగ్గవాగుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోంలోని ఆలయంలోకి రాహుల్‌గాంధీ వెళ్తున్న సమయంలో బీజేపీ శ్రేణులు అడ్డుకోవడం దారుణమన్నారు. శ్రీరాముడు బీజేపీకి మాత్రమే దేవుడన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మణుగూరులో పాయం ఆధ్వర్యంలో..

మణుగూరు టౌన్, జనవరి 23: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు నిరసన వ్యక్తం చేసి ధర్నా చేపట్టారు.

సుభాశ్ చంద్రబోస్‌కు బీఆర్ఎస్ నేతల నివాళి

పాల్వంచ, జనవరి 23: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం పాల్వంచలోని నటరాజ్ సెంటర్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, రంగారావు, సురేశ్, నాగమల్లేశ్వరరావు, రామారావు, ప్రకాష్, అఫ్జల్, ప్రసాద్‌రావు, వీరారెడ్డి, లక్ష్మారెడ్డి, బాలకృష్ణ, నారాయణ, ఇసాక్ పాల్గొన్నారు.

కల్పవృక్ష నారసింహ సాల గ్రామమూర్తి శ్రీ మహావిష్ణువే

భద్రాచలం, జనవరి 23 : కల్పవృక్ష నారసింహ సాల గ్రామమూర్తి సాక్షాత్తు మహావిష్ణువే అని ఎర్రవరం బాల ఉగ్ర నరసింహస్వామి ఆలయ పూజారి సాయి స్వామి అన్నారు. మంగళవారం ఆయన భద్రాచలం పట్టణంలోని అంబాసత్రం సమీపంలో వేంచేసి ఉన్న నృసింహస్వామివారి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన కల్పవృక్ష నారసింహ సాల గ్రామ మూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందించారు.

ఇకపై అన్నీ ప్రధాన అంగన్‌వాడీలే: సీడీపీవో

చంద్రుగొండ, జనవరి 23 : ఇకపై అన్ని గ్రామాల్లో మినీ అంగన్‌వాడీలు ఉండవని, అన్ని ప్రధాన అంగన్‌వాడీలుగా మారాయని సీడీపీవో నిర్మలాజ్యోతి తెలిపార. మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులను అంగన్‌వాడీ టీచర్లు అందజేశారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులను ఆమె స్వయంగా అంగన్‌వాడీలకు అందజేశారు.

'ఉద్యమకారులకు పథకాలు వర్తింపజేయాలి'

బూర్గంపహాడ్, జనవరి 23: ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కేసులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం వర్తింపచేయాలని ఉద్యమనేత తిప్పన సిద్ధులు అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల మండల అధ్యక్షుడు బాగి వెంకట్రావు, పొడియం నరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 నుంచి ఉద్యమకారులకు అన్నివిధాలా అన్యాయం జరుగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం చేయాలని అన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

★మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323057

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

26న సన్మానం

మణుగూరు టౌన్, జనవరి 23: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలోని ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నట్లు ఏరియా డీజీఎం (పర్సనల్), అధికార ప్రతినిధి సలగల రమేశ్ మంగళవారం తెలిపారు. ఈ నెల 26న పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా ప్రతాలు అందజేసి సత్కరించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఉద్యోగులు, అధికారులుగా ఎంపికైన వారిలో సీహెచ్ శ్రీనివాస రెడ్డి, సుందర్‌రాజన్ నల్లస్, నక్క సుమిత్, వెనిగల్ల రాజశేఖర్, దుడ్డుకురు మురళీ, గడ్డం శ్రీహరిబాబు, షేక్ చాంద్‌పాషా, జక్కం రమేశ్, ఆర్.రాంబాబు, పి.వెంకట శివరామ రాజు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

చదువుపై అమితాసక్తి ఉండాలి

- కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పెంచుకోవాలి
- టెన్త్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే

సదస్సులో మాట్లాడుతున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ/ అన్నపురెడ్డిపల్లి, జనవరి 23 : పాఠశాలల్లో విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోని, నూతన విషయాలను తెలుసుకోవాలనే ఆలోచనను ఆకళింపు చేసుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస (స్కిల్ డెవలప్‌మెంట్) ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని, విభిన్నంగా ముందుకు వెళ్లాలన్నారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు టిఫిన్ కోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని హెచ్ఎం క్రిష్ణకుమారికి అందజేశారు. కార్యక్రమంలో మోటివేటర్ చందు, హెచ్ఎం క్రిష్ణకుమారి, ఎంపీపీ బానోత్ పార్వతి, సర్పంచ్ బానోత్ కుమారి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస రావు, సొసైటీ చైర్మన్ చెవుల చందర్ రావు, నాయకులు అంకిరెడ్డి క్రిష్ణారెడ్డి, మాలోత్ భోజ్యానాయక్, కొదుమూరి దయాకర్‌రావు, గోవిందరెడ్డి, పొన్నె బోయిన భిక్షమయ్య, తుమ్మలపల్లి సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.

కార్మికుల సొంతింటి పథకంపై దృష్టి సారించాలి

సీఎండీని కలిసిన కొత్తగూడెం ఎమ్మెల్యే, ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి సీఎండీ బలరాంతో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

రామవరం, జనవరి 23: కోల్‌బెల్టు ప్రాంతాల్లో ప్రతిపాదనలో ఉన్న నూతన ప్రాజెక్టులతోపాటు కొత్త భూగర్భ గనుల ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతో కలిసి సంస్థ సీఎండీ బలరాంను కలిసి చర్చించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గడిచిన దశాబ్దకాలంగా ఒక్క నూతన భూగర్భగనిని ప్రారంభించలేదని, సింగరేణి ప్రాంతాల్లో ఎంతోమంది యువకులు ఉపాధి లేక వలసబాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. కార్మికుల సొంతింటి పథకంపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సింగరేణి ఆస్పత్రులను బలోపేతం చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి: కలెక్టర్ ప్రియాంక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని, ప్రసవాలకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా సేవలు అందించాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, భద్రాచలం డాక్టర్ రాజ్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, సూపరింటెండెంట్ కుమార స్వామి, ఎంపీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

జడ్పీలో సన్నాహక సమావేశం

చుంచుపల్లి, జనవరి 23: జిల్లా అభివృద్ధికి ప్రణాళికల తయారీ కోసం మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రజల ఆర్థిక అభివృద్ధి పెంపొందించి సామాజిక న్యాయం సాధించేందుకు 2024-25 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులను విడుదల చేయనున్నారు. వీటికి సంబంధించిన మార్గదర్శకాలను సమావేశంలో వివరించారు. జడ్పీ సీఈవో విద్యాలత, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, పీఆర్ఈఈ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ మంగ్యానాయక్ పాల్గొన్నారు.

అదృశ్యం కథ సుఖాంతం

కొత్తగూడెం క్రైం, జనవరి 23 : ఇద్దరు విద్యార్థుల మిస్సింగ్ కేసులను వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. పాత కొత్తగూడెంలోని తెలంగాణ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఉషోదయ అక్షయ్ ఈ నెల 19వ తేదీన అదృశ్యమైన కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు సదరు బాలుడిని గుర్తించి సోమవారం తల్లిదండ్రులకు అప్పగించిన విషయం విదితమే. అదేరోజు కొత్తగూడెం పోస్టాఫీస్ ఏరియాలోని మరో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కుడుముల ప్రవీణ్‌రెడ్డి అదృశ్యమైన విషయం సైతం తెలిసిందే. ఈ కేసుని సైతం వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. ఇంటి నుంచి పారిపోయిన ప్రవీణ్‌రెడ్డిని కొత్తగూడెం బస్టాండ్ వద్ద గుర్తించిన వన్‌టౌన్ పోలీసులు సదరు బాలుడిని సీఐ ఎం.కరుణాకర్ నేతృత్వంలో తల్లి మౌనికకు అప్పగించారు. దీంతో విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతమైంది.

ట్రాక్టర్ పల్టీ: డ్రైవర్ మృతి

గుండాల, జనవరి 23: గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకున్నది. సాయనపల్లి పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్యాంకర్‌తో ప్రధాన రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పోస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ బొమ్మెర రామ్మూర్తి (29) ట్రాక్టర్ ఇంజన్ కింద పడి మృతి చెందాడు. సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రీయ పద్ధతితో అధిక దిగుబడులు

దుమ్ముగూడెం పర్యటనలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

నేలపై కూర్చొని ఆదివాసీలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం/ దుమ్ముగూడెం, జనవరి 23: రసాయన ఎరువులతో పంటలు పండించకుండా సేంద్రీయ వ్యవసాయాన్ని పాటిస్తూ రైతులు పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని సింగవరంలో పంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సింగవరం, వైటనాగారం, పౌలూరిపేట, ఎన్.లక్ష్మీపురం గ్రామాలకు చెందిన వారితో ఆయన మాట్లాడుతూ.. సేంద్రీయ పద్ధతిలో సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఆరాతీసి సేంద్రీయ వ్యవసాయం ఎలా ఉంది పంటల సాగు దిగుబడులు ఎలా ఉన్నాయి, నీటిసౌకర్యం బాగుందా... త్రీఫేజ్ కరెంటు సౌకర్యం ఉందా అంటూ గిరిజన రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లి మార్గమధ్యలో ఇటీవల వరదలకు శిథిలమైన కాజ్‌వేను పరిశీలించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి: పీవో

అధికారులు, సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని, అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జీసీసీ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులను, సిబ్బందిని పీవో ప్రతీక్ జైన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన జీసీసీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

డీఆర్‌సీసీ కేంద్రాన్ని పరిశీలించిన పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం పట్టణంలోని మనబోతుల చెరువు వద్ద కొత్తగా నిర్మిస్తున్న డీఆర్‌సీసీ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో, పంచాయతీ అధికారి ప్రతీక్ జైన్ మంగళవారం సందర్శించారు. డీఆర్‌సీసీ షెడ్‌ను, వర్మీ కంపోస్ట్ కట్టడాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావును ఆదేశించారు.

పోలీస్‌స్టేషన్‌లో దొంగలు పడ్డారు?

- మాయమైన గంజాయి, ద్విచక్రవాహనాలు
- ఇంటి దొంగల పనేనంటూ జోరుగా ప్రచారం

సారపాక, జనవరి 23: రక్షణకు నిలయమైన పోలీసు స్టేషన్‌లోనే దొంగలు పడి గంజాయి, ద్విచక్రవాహనాలు మాయం చేశారని విశ్వసనీయంగా తెలుస్తోంది. బూర్గంపహాడ్ పాత పోలీసుస్టేషన్ శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కొత్త పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న పాత పోలీస్‌స్టేషన్‌లోని గంజాయి ప్యాకెట్లు, వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను మాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది. కాగా, పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని తెలుసుకొని స్టేషన్‌కు చేరుకుని ఆరా తీసినట్లు తెలుస్తోంది. అయితే బయటి వ్యక్తులతోపాటు సొంత శాఖకు చెందిన ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

ప్రచారంలో నిజం లేదు: ఎస్సై రాజ్‌కుమార్

ఈ విషయంపై ఎస్సై రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. 'పోలీస్‌స్టేషన్‌లో గంజాయి, ద్విచక్రవాహనాల మాయంపై జరుగుతున్న ప్రచారం అవాస్తం. ఇందులో ఎలాంటి నిజమూ లేదు. ఇవన్నీ పుకార్లే' అంటూ సమాధానమిచ్చారు.

క్రమశిక్షణతో పనిచేస్తేనే ప్రత్యేక గుర్తింపు

మొబలైజేషన్ పరేడ్‌లో ఎస్పీ రోహిత్‌రాజు

పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్

కొత్తగూడెం క్రైం, జనవరి 23: క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు అన్నారు. హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో మంగళవారం ఏఆర్ సిబ్బందికి మొబలైజేషన్ పరేడ్ ప్రారంభమైంది. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పనిచేసే ప్రతిఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఈ.విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్ఐ రవి, ఎంటీవో సుధాకర్, హోంగార్డ్స్ ఆర్ఐ నర్సింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలి: ఎస్పీ

ఉద్యోగ విరమణ పొందిన వారు శేషజీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు అన్నారు. హోం గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్ రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఎస్పీ మంగళవారం ఆయనను తన కార్యాలయంలో సత్కరించారు.

'ఖాతాదారులకు రూ.కోటి ప్రమాద బీమా'

కొత్తగూడెం సింగరేణి, జనవరి 23: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేతన ఖాతా ఉన్న ప్రతీ ఒక్క సింగరేణి ఉద్యోగికి ఎటువంటి ప్రీమియం లేకుండా రూ.కోటి ప్రమాద బీమా ఫిబ్రవరి 1 నుంచి వర్తిస్తుందని బ్యాంకు అధికారులు తెలిపారు. మంగళవారం హెడ్డాఫీస్‌లో యూబీఐ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రమాదబీమా అంశాలను చర్చించారు. సీఎండీ బలరాం చొరవతో సింగరేణి యాజమాన్య కార్పొరేట్ పరిధిలోని సంక్షేమ విభాగ అధికారులతో సింగరేణి ఉద్యోగుల కోసం యూబీఐ అధికారులు చేసుకున్న ఒప్పందం ద్వారా ఈ ప్రమాద బీమా మొత్తం వర్తిస్తుందన్నారు.

సారపాకలో గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- వారిలో ఇద్దరు మైనర్లు

సారపాక, జనవరి 23: అక్రమంగా రవాణా చేస్తున్న 22 కిలోల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకున్న ఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాల్వంచ సీఐ వినయ్ కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట వద్ద 22 కిలోల గంజాయిని కొనుగోలు చేసి బ్యాగుల్లో స్కూటీపై వస్తుండగా సోమవారం సాయంత్రం ఎస్సై రాజ్‌కుమార్‌కు అందిన సమాచారం మేరకు సారపాక వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి వారిని ఆపగా పరారయ్యేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. వారిని విచారించగా బూర్గంపహాడ్‌కు చెందిన గిరిబోయిన విష్ణువర్ధన్‌తో పాటు బూర్గంపహాడ్, సారపాకకు చెందిన మరో ఇద్దరు మైనర్లుగా నిర్ధారించి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న 22 కిలోల గంజాయి ప్యాకెట్లను స్టేషన్‌కు తరలించామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ వినయ్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందన్నారు.

సంక్షిప్తంగా

జిల్లాలో ఐదుగురు ఎస్సైల బదిలీ

కొత్తగూడెం క్రైం, జనవరి 23: జిల్లాలో ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం త్రీటౌన్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్సై జీవన్‌రాజును జూలూరుపాడుకు, జూలూరుపాడులో విధులు నిర్వర్తిస్తున్న బి.పురుషోత్తంను కొత్తగూడెం త్రీటౌన్‌కు, ములకలపల్లి నుంచి రిలీవ్ అయ్యి కొత్తగూడెం వన్‌టౌన్‌లో అటాచ్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సాయి కిశోర్‌రెడ్డిని దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు, దమ్మపేట ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్‌ను కొత్తగూడెం వన్‌టౌన్‌కు, ములుగు జిల్లాలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న కె.తిరుపతిని కొత్తగూడెం జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాబ్ మేళా విజయవంతం

భద్రాచలం, జనవరి 23: ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైందని ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. జాబ్‌మేళాలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 150 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా 100కు పైగా అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

26న భద్రాచలానికి హైకోర్టు జడ్జి వేణుగోపాల్

భద్రాచలం, జనవరి 23: ఈ నెల 26న భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు, మేజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని ప్రారంభించేందుకు హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ రానున్నారని మాజీ ఏపీపీ కోట దేవదానం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

పర్ణశాల, జనవరి 23: పర్ణశాల జడ్పీఎస్ఎస్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడిపై విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మంగళవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎంకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు సరిగాలేదని, పాఠాలూ సక్రమంగా బోధించడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ నరసాపురం పాఠశాలలో పని చేస్తూ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో విధుల నుంచి తొలగించడం జరిగిందని, తిరిగి పర్ణశాల పాఠశాలకు నియమించారని అన్నారు. ఆ ఉపాధ్యాయుడు ఉంటే విద్యార్థినులు పాఠశాలకు రావడానికి భయపడుతున్నారని అన్నారు.

రోడ్లపై బర్త్‌డే వేడుకలు చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

కొత్తగూడెం క్రైం, జనవరి 23: సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా రోడ్లపై పుట్టిన రోజు కేకులు కట్ చేయడం, యూత్ పేర్లతో ఫ్లెక్సీలు కట్టడం వంటివి చేస్తే చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా ఆకతాయి చర్యలకు పాల్పడితే చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని ప్రకటనలో హెచ్చరించారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, జనవరి 23: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. ఎర్రగుంటకు చెందిన మద్దెబోయిన శ్రీను (23) మద్యానికి బానిసయ్యాడు. తండ్రి లేకపోవడంతో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంట్లో ఉరేవేసుకున్నాడు. గమనించిన తల్లి స్థానికుల సహాయంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై షాహీనా కేసు దర్యాప్తు చేపట్టారు.

పురుగుమందు తాగి వివాహిత..

ములకలపల్లి, జనవరి 23 : పురుగుమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రామచంద్రపురం గ్రామానికి చెందిన బన్నె లక్ష్మి (32) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో పురుగుమందు తాగింది. గమనించి భర్త వేణుబాబు చికిత్స కోసం ఖమ్మం తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. ఎస్సై రాజమౌళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అశ్వారావుపేట, జనవరి 23: అనారోగ్య కారణాలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్త కావడిగుండ్ల గ్రామానికి చెందిన వరలక్ష్మీ(22) కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఈ నెల 20వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి పొట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రభాకరాచార్యులు కవితకు అరుదైన గుర్తింపు

అశ్వారావుపేట టౌన్, జనవరి 23: అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా కరీంనగర్‌కు చెందిన జాతీయ సాహిత్య పరిషత్ జాతీయ స్థాయిలో ప్రచురించిన 'అయోధ్య' సంకలనంలో అశ్వారావుపేటకు చెందిన కవి, సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రాసిన కవితకు స్థానం లభించింది.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎంపీపీ

అన్నపురెడ్డిపల్లి, జనవరి 23: అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ సున్నం లలిత అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె వివిధ శాఖల అధికారుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీడీవో అన్నపూర్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్టులో 'స్పందన' ప్రతిభ

ఇల్లెందు రూరల్, జనవరి 23: జిల్లా గణిత టాలెంట్ టెస్టులో మండలంలోని సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జే.స్పందన ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ తెలిపారు. స్పందనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో

అన్నపురెడ్డిపల్లి, జనవరి 23: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు చేశారు.

సంఘ విద్రోహ శక్తులకు సహకరిస్తే చర్యలు: సీఐ

గుండాల, జనవరి 23: సంఘ విద్రోహ శక్తులకు ప్రజలెవ్వరూ సహకరించవద్దని, అలా సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల సీఐ రవీందర్ హెచ్చరించారు. మంగళవారం ఆదివాసీ వలస గొత్తికోయ గ్రామమైన అడవిరామారం గ్రామాన్ని ఆళ్లపల్లి ఎస్సై రతీష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

సారపాక అభివృద్ధికి రూ.6 కోట్ల ప్రతిపాదనలు

సారపాక, జనవరి 23: సారపాక పంచాయతీ అభివృద్ధికి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను జీపీడీపీ కింద కేంద్ర ప్రభుత్వానికి రూ.6 కోట్ల ప్రతిపాదనలు పంపామని ఎంపీవో సునీల్ శర్మ తెలిపారు. మంగళవారం సారపాక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జీపీడీపీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. సారపాక పంచాయతీలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధుల కోసం ఈ ప్రతిపాదనల ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అభివృద్ధి పనులు చేయాలంటూ ప్రజలు, అఖిలపక్షం నేతలు ఎంపీవోకు వినతిపత్రాలు అందజేశారు.